తటాకం.. దుర్గంధం

- కంపుకొడుతున్న కఠోరా హౌస్ తటాకం
- అభివృద్ధికి నోచుకోని చారిత్రక చెరువు
- నిర్వహణను గాలికొదిలేసిన అధికారులు


దుర్గంధభరితంగా మారిన చారిత్రక కఠోరా హౌస్

గోల్కొండ: చారిత్రక కట్టడాలు, ప్రదేశాల నిర్వహణను అటూ కేంద్ర ప్రభుత్వం ఇటూ రాష్ట్ర ప్రభుత్వం గాలికి వదిలేసింది. హైదరాబాద్‌ను పాలించిన కుతుబ్‌షాహీ రాజులు నిర్మించిన సుందర కఠోరాహౌస్ నేడు దుర్గంధభరితంగా మారింది. కేంద్ర పురాతత్వ సర్వేక్షణ శాఖ ఆధీనంలో ఉన్న ఈ తటాకాన్ని తెలంగాణ ప్రభుత్వం కూడా నిర్లక్ష్యం వహిస్తోంది. మూడు దశాబ్దాలుగా అధికారులు, మంత్రులు, బల్దియా మేయర్లు కఠోరాహౌస్‌ను సందర్శించి అభివృద్ధి చేస్తామంటూ హామీలు ఇస్తున్నారే తప్ప ఇప్పటి వరకు అభివృద్ధి కోసం ఒక్క నయాపైసా కూడా ఖర్చు పెట్టలేదు.

ఫెన్సింగ్ లేక వ్యర్థాల డంపింగ్...

కఠోరా హౌస్ నలువైపుల నుంచి జరుగుతున్న డంపింగ్‌ను ఆపడంలో సైతం అధికారులు శ్రద్ధ కనబరచడం లేదు. కఠోరా హౌస్ మాది అంటున్న గోల్కొండ కోట అధికారులు ఇక్కడ కనీసం ఒక సెక్యూరిటీ గార్డును సైతం నియమించకపోవడం దారుణం. కనీసం గట్టి ఫెన్సింగ్‌ను ఏర్పాటు చేయడంలో కూడా అధికారులు చొరవ చూపడం లేదు.

ఇక్కడి నుంచే కోటలోకి తాగునీరు

రాజుల కాలంలో కఠోరా హౌస్ నుంచి గ్రావిటేషనల్ పద్ధతిలో గోల్కొండ కోటలోని రాణి వాసానికి తాగునీరు అందేదని చరిత్రలో ఉంది. ఇంతటి ఘన చరిత్ర గల కఠోరాహౌస్ నేడు దుర్గంధభరితమైన మురికి కుంటగా మారింది.

ఫెన్సింగ్ ఉంటే తటాకంలో వ్యర్థాల డంపింగ్‌ను అదుపు చేయవచ్చునని స్థానికులు అంటున్నారు.

ఆరు నెలలు మురుగు..
ఆరు నెలలు గుర్రపుడెక్క

సంవత్సరంలో ఆరు నెలల పాటు ఈ చెరువు మురికి నీటితో నిండి ఉంటుంది. ఆరు నెలలు కేవలం వ్యర్థాలు, గుర్రపు డెక్కమాత్రమే కానవస్తుంది. కొన్ని సంవత్సరాల క్రితం వరకు కఠోరా హౌస్‌లో గుర్రపు డెక్క తొలగింపు పనులు వర్షాకాలంలో చేపట్టే వారు. అయితే ఆపనులు కూడా ప్రస్తుతం జరగడం లేదు. కఠోరాహౌస్ నేడు ఒక డంపింగ్ యార్డుగా మారిందని దీనిని దోమల ఉత్పత్తి కేంద్రంగా కూడా చెప్పవచ్చునని స్థానికులు అధికారుల తీరుపై ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

అమలుకు నోచుకోని హామీలు...

గతంలో నగర మేయర్‌గా ఉన్న తీగల కృష్ణారెడ్డి అనంతరం బల్దియా కమిషనర్లు టూరిజం మినిస్టర్లు కఠోరా హౌస్‌ను అభివృద్ధి చేస్తామంటూ ప్రకటనలు చేశారు. కఠోనా హౌస్‌ను బోటింగ్ కేంద్రాగా చేస్తామన్నారు. స్థానికులకు ఉపాధి కూడా లభిస్తుందని అధికారులు ప్రజలను ఊదరగొట్టారు. ఆ తర్వాత అధికారులు తిరిగి ఇటువైపు కన్నెత్తి చూడలేదు. కఠోరాహౌస్ ప్రస్తుతం గేదెలు, వీధి కుక్కలకు విడిది కేంద్రంగా మారింది. వేసవిలో స్థానికులకు ప్లేగ్రౌండ్‌గా మారుతోంది.

ప్రహరీ లేక ఓ వ్యక్తి పడి మృతి..

రెండేళ్ల క్రితం రోడ్డుకు ఆనుకొని ఉన్న కఠోరాహౌస్ ప్రహరీ ఒకేసారి కుప్పకూలి ఒకవైపు ఒరిగిపోయింది. ఈ సంఘటనలో అక్కడ పార్కు చేసి ఉన్న రెండు కార్లు, రెండు ఆటోలు ధ్వంసమయ్యాయి. కఠోరాహౌస్‌కు కిరువైపులా ప్రహరీ లేకపోవడంతో ఆరు నెలల క్రితం ఓ వ్యక్తి ప్రమాదవశాత్తు కాలు జారి బురదలో పడి మృతి చెందాడు. ఇంత జరుగుతున్న కూడా అధికారులు తమకు సంబంధం లేన్నట్లుగా ప్రవర్తిస్తున్నారు.

ప్రహసనంగా హైమాస్ట్ లైట్ల నిర్వహణ


షేక్‌పేట్ రోడ్డులో ఒక వైపు వెలుగుతున్న హైమాస్ట్ లైట్లు

గోల్కొండ: రాత్రి పూట ప్రజలకు వెలుగులు అందించేందుకు ప్రభుత్వం ఏర్పాటు చేసిన హైమాస్ట్ విద్యుత్ లైట్ల నిర్వహణ అధ్వానంగా మారింది. బల్దియా విద్యుత్ దీపాల విభాగం అధికారులు వాటి నిర్వహణను గాలికి వదిలేశారు. బస్తీలు, కాలనీల్లోని హైమాస్ట్ లైట్లు, మినీ హైమాస్ట్ లైట్లు ఎప్పుడు వెలుగుతాయో తెలియని పరిస్థితి నెలకొంది. దీనికి తోడుగా ప్రధాన చౌరస్తాలైన రేతిబౌలి, నానల్‌నగర్ బస్టాప్, టోలిచౌకీ, షేక్‌పేట్ తదితర ప్రాంతాల్లోని హైమాస్ట్ లైట్లలో చాలా వరకు వెలగడం లేదు. వెలుగుతున్న వాటిలోనూ కొన్ని మాడిపోగా కొన్ని మాత్రమే వెలుగులు ఇస్తున్నాయి.

గవర్నర్‌కు సత్కారం..



అబిడ్స్: రాష్ట్ర గవర్నర్ జిష్ణుదేవ్ వర్మను రాష్ట్ర పోలీస్ హౌసింగ్ కార్పొరేషన్ మాజీ చైర్మన్ కోలేటి దామోదర్ గుప్తా ఘనంగా సత్కరించారు. బుధవారం గవర్నర్‌ను మర్యాదపూర్వకంగా కలిసిన ఆయన శాలువాతో సన్మానించి ఉగాది శుభాకాంక్షలు తెలిపారు.

6న జగదీష్ మందిరంలో సీతారామ కల్యాణం

చార్మినార్: శ్రీరామనవమి వేడుకలను పురస్కరించుకుని ఈనెల 6 న లాల్ దర్వాజా జగదీష్ మందిరంలో సీతారామ కల్యాణాన్ని వైభవంగా నిర్వహించనున్నట్లు దేవాలయ కమిటీ అధ్యక్షుడు, ఉత్సవ నిర్వాహకులు కంశెట్టి భాగ్యలక్ష్మి శ్రీధర్ నేత (బుల్లెట్ శ్రీధర్) తెలిపారు. వెంకట్రావు స్కూల్ సమీపంలోని పోతరాజు గల్లీలో ఏటా కల్యాణోత్సవాన్ని అంగరంగ వైభవంగా నిర్వహిస్తున్నామన్నారు. పాతబస్తీ ప్రజలే కాకుండా నగరంలోని ఇతర ప్రాంతాల నుంచి వచ్చే భక్తుల సౌకర్యార్థం తగిన ఏర్పాట్లు చేస్తున్నట్లు తెలిపారు.

నిలోఫర్‌లో ఆటిజంపై అవగాహన


ఆటిజంతో బాధపడుతున్న చిన్నారులతో డాక్టర్ రవికుమార్

నాంపల్లి: అంతర్జాతీయ ఆటిజం అవగాహన దినోత్సవం సందర్భంగా బుధవారం నిలోఫర్ ఆసుపత్రిలో ప్రత్యేక కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమానికి ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ ఎస్.రవికుమార్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆటిజంతో బాధపడుతున్న పిల్లలతో వారి మెదడులను ఉత్తేజపరిచే కార్యకలాపాలను చేయించారు. కార్యక్రమంలో ఆర్ఎంఓ నాగజ్యోతి, ప్రొఫెసర్ వినోద్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

12న సంగీత పరిశోధన అంశాలపై శిక్షణ శిబిరం


వాల్ పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న డాక్టర్ పావని, విజయకుమార్, సుధామాల, ఇందిరాహేమ

చిక్కడపల్లి: ప్రసిద్ధ సాంస్కృతిక సంస్థ సమితి ఆధ్వర్యంలో హంసధ్వని సంగీత పరిశోధన అంశాల రూపకల్పనపై ఈ నెల13న శిక్షణ శిబిరం నిర్వహించనున్నట్లు సమితి అధ్యక్షుడు వేమరాజు విజయకుమార్, సమన్వయ కర్తలు నిష్టల సుధామాల, డాక్టర్ ఇందిరా హేమలు తెలిపారు. ఈ మేరకు బుధవారం వారు చిక్కడపల్లిలోని సమితి కార్యాలయంలో ప్రముఖ సంగీత విద్వాంసురాలు, హైదరాబాద్ కేంద్రీయ విశ్వవిద్యాలయం సంగీత విభాగం అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ పావని దుద్దు, సమితి సభ్యులతో కలిసి కార్యక్రమ పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఈ శిబిరంలో సంగీత పరిశోధనా రంగంలో కొత్తగా అడుగు పెట్టిన విద్యార్థులు, అధ్యాపకులు ఆసక్తిగల పరిశోధకులు విశ్లేషణాత్మక ఆలోచన, సరైన శోధనా అంశాల ఎంపిక , పరిశోధనా విధానాలు సమాచార సేకరణ విధానాలపై అవగాహన కల్పించనున్నట్లు తెలిపారు.

గంజాయి పట్టివేత



అబిడ్స్: ధూల్‌పేట మంగళ్‌హాట్ ప్రాంతంలో రాష్ట్ర ఎక్సైజ్ టాస్క్ ఫోర్స్ పోలీసులు 2.14 కేజీల గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. బుధవారం గాంధీ బైటక్ ప్రాంతంలో గంజాయి విక్రయిస్తున్నట్లు సమాచారం అందడంతో దాడి చేసిన పోలీసులు హేమంత్‌సింగ్ అనే వ్యక్తిని అరెస్టు చేశారు. అతడిచ్చిన సమాచారంతో గంజాయి విక్రయానికి సహకరించిన గోవింద్ సింగ్, రమేష్ సింగ్‌లపై కేసులు నమోదు చేశారు. అదేవిధంగా అఫీజ్‌పేట్ బస్టాప్‌లో గంజాయి విక్రయిస్తున్న అర్బాజ్‌ను అరెస్ట్ చేసి 1.3 కేజీల గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. ఈ కేసులో ఒక బైక్, ఒక సెల్‌ఫోన్‌ను సీజ్ చేసినట్లు టాస్క్‌ఫోర్స్ అధికారి అంజిరెడ్డి తెలిపారు.

పూలే జయంతి ఉత్సవాలకు ఆహ్వానం


ఎంపీ ఈటలకు ఆహ్వాన పత్రిక అందజేస్తున్న బీసీ ఐక్యవేదిక నాయకులు

గోల్కొండ: సామాజిక సంస్కర్త, బీసీ బడుగు వర్గాల ఆశాజ్యోతి జ్యోతిరావు పూలే జయంతి ఉత్సవాలకు హాజరుకావాలని కార్వాన్ బీసీ ఐక్యవేదిక నాయకులు పార్లమెంట్ సభ్యులు ఈటల రాజేందర్‌ను కోరారు. ఈ మేరకు బుధవారం ఆయనను కలిసి గుడిమల్కాపూర్‌లో జరగనున్న జ్యోతిరావు పూలే 198వ జయంతి ఉత్సవాల ఆహ్వాన పత్రిక అందజేశారు. హోదా, ప్రతిష్ఠను ఆశించకుండా జ్యోతిరావుపూలే చేసిన కృషి ప్రతి ఒక్కరికి తెలుసునని ఈటల రాజేందర్ అన్నారు. ఆయనను కలిసిన వారిలో బీసీ ఐక్యవేదిక నాయకులు కె.అనిల్ కుమార్, పంబి శ్రీనివాస్, నర్సింగ్, శ్యామ్‌సుందర్, వెంకటేష్, బీజేపీ ఓబీసీ మోర్చా రాష్ట్ర సహ కార్యదర్శి ప్రభు పూజారి, కట్ట నర్సింగ్‌రావు తదితరులు ఉన్నారు.

హెచ్‌సీయూ భూముల వేలం అనైతికం


మాట్లాడుతున్న దేవర శ్రీనివాస్

గోల్కొండ: కాంగ్రెస్ ప్రభుత్వం విద్యా రంగాన్ని నిర్లక్ష్యం చేస్తుందని బీజేపీ కిసాన్ మోర్చా రాష్ట్ర ఉపాధ్యక్షులు దేవర శ్రీనివాస్ ఆరోపించారు. హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీకి చెందిన 400 ఎకరాల భూముల వేలంపై బుధవారం ఆయన గుడిమల్కాపూర్‌లో జరిగిన సమావేశంలో మాట్లాడారు. రాష్ట్రాన్ని పాలించడం చేతకాక ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి తుగ్లక్‌లా వ్యవహరిస్తున్నారన్నారు. ముఖ్యమంత్రి ఎప్పుడు ఏమి మాట్లాడతారో అర్థంకాక ప్రజలు అయోమయానికి గురవుతున్నారన్నారు. ఓ వైపు మూసీ సుందరీకరణ అంటూ మరో వైపు హైడ్రాతో ప్రజలను తీవ్ర భయభ్రాంతులకు గురి చేసిన ఘనత ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికే దక్కుతుందన్నారు. విద్యా రంగానికి బడ్జెట్‌లో సరైన నిధులు కేటాయించకుండా నిర్లక్ష్యం చేశారని నేడు యూనివర్సిటీ భూములను స్వాధీనం చేసుకోవడం ఆయనకే చెల్లిందన్నారు. బాధ్యతలు చేపట్టాన 15 నెలల్లో ఆయన చేసిన ఒక్క మంచి పనిని ప్రజలకు తెలపాలని సవాల్ విసిరారు. పేదలు మరింత నిరుపేదలయ్యారని రాష్ట్రాన్ని లక్షల కోట్ల అప్పుల ఊబిలోకి దింపిన ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి నియంతలా వ్యవహరిస్తున్నారని ఆరోపించారు. హెచ్‌సీయూ భూముల స్వాధీనాన్ని అడ్డుకుంటున్న విద్యార్థులపై పోలీసులు లాఠీ చార్జీ చేయడం దారుణమన్నారు. భూ ముల స్వాధీనాన్ని వెంటనే నిలిపి వేసి వాటిని హెచ్‌సీయూకు కేటాయిస్తు జీవో జారీ చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో నామా యాదగిరినేత, అశోక్ తదితరులు పాల్గొన్నారు.

మదర్సాలో ఈద్ మిలాప్


ఈద్ మిలాప్‌లో పాల్గొన్న విద్యార్థులు

గోల్కొండ: గోల్కొండ నయాకీలాలోని ఏహెచ్ మదర్సాలో బుధవారం ఈద్ మిలాప్ కార్యక్రమం నిర్వహించారు. సయ్యద్ అబీబ్ ఆలీ ఖురేషీ సౌజన్యంతో ఏర్పాటు చేసిన ఈ కార్యక్రమంలో విద్యార్థులకు షీర్ కూర్మా వితరణ చేశారు. ఈ సందర్భంగా మదర్సా నిర్వాహకుడు మౌలానా మహ్మద్ మాట్లాడుతూ మదర్సా విద్యార్థులకు రంజాన్ నెల రోజుల పాటు ఇఫ్తార్, సహరీ భోజన ఏర్పాట్లు చేయించిన సయ్యద్ అబీబ్ ఆలీ ఖురషీ సేవలు అభినందనీయమన్నారు. నెల రోజుల పాటు మదర్సా విద్యార్థులు దైవపఠనంలో ఉపవాసం ఉంటూ దైవ కృపకు పాత్రులయ్యారన్నారు. రంజాన్ మాసంలోనే కాకుండా సాధారణ రోజుల్లో కూడా ఖురేషి మదర్సా విద్యార్థులకు అండగా ఉంటారని పీస్ ఫోర్స్ సొసైటీ నగర అధ్యక్షులు మహ్మద్ నజీబ్ అన్నారు.

సీతారాముల కల్యాణం పోస్టర్ ఆవిష్కరణ


సీతారాముల కల్యాణ మహోత్సవ పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న సంఘం సభ్యులు

ముషీరాబాద్: ఆర్యవైశ్య సంఘం రామ్‌నగర్ శ్రీ వాసవీ కన్యకా పరమేశ్వరి ఫ్యామిలీ వెల్ఫేర్ అసోసియేషన్, శ్రీ వాసవీ స్వర్ణ నిధి రాంనగర్‌ల సంయుక్త ఆధ్వర్యంలో 25వ సీతారాముల కళ్యాణ మహోత్సవాన్ని ఈ నెల 5,6,7 తేదీల్లో నిర్వహిస్తున్నట్లు ఆర్య వైశ్య సంఘం అధ్యక్షులు వి.సుధాకర్ గుప్తా తెలిపారు. రాంనగర్‌లోని సెయింట్ పాయిస్ స్కూల్ వద్ద కల్యాణం నిర్వహిస్తున్నామన్నారు. ఈ మేరకు బుధవారం ఉత్సవాల పోస్టర్‌ను ఆవిష్కరించారు. 5న ఉదయం 6 గంటలకు సుదర్శన హోమం, 10 గంటలకు మంగళ స్నానం, మధ్యాహ్నం మెహందీ, సాయంత్రం 5 గంటలకు పారాయణం ఉటుందన్నారు. 6న ఉదయం 8.30 గంటలకు ఎదుర్కోలు, అనంతరం సీతారాముల కల్యాణం, 7న సోమవారం ఉదయం 8.30 గంటలకు సత్యనారాయణ స్వామి వత్రం, 11 గంటలకు సీతారామచంద్ర స్వామి వారి పట్టాభిషేకం, 12 గంటలకు మహిళలచే దాండియా నృత్య ప్రదర్శన ఉంటుందన్నారు. 70 ఏళ్లు పైబడిన మాతృమూర్తులకు పాదాభిషేకం చేస్తున్నట్లు తెలిపారు. సమావేశంలో ఆర్యవైశ్య సంఘం నాయకులు బుక్క రమేష్, సత్యవర్ధన్, ఎర్రం శ్రీనివాస్, చామల శ్రీనివాస్, ఎర్రం శేఖర్, నేతి సత్యనారాయణ, సంఘ సేవకులు లింగంయాదవ్ తదితరులు పాల్గొన్నారు.

రాములోరి కల్యాణానికి ఆహ్వానం



సాక్షి, సిటీబ్యూరో: భాగ్యనగర్ శ్రీరామనవమి ఉత్సవ సమితి ఆధ్వర్యంలో సీతారాంబాగ్‌లోని సీతారామ మందిరంలో నిర్వహించే రాములోరి కల్యాణానికి హాజరు కావాలని నిర్వాహకులు రాష్ట్ర గవర్నర్ జిష్ణుదేవ్ వర్మను కోరారు. ఈ మేరకు భాగ్యనగర్ శ్రీరామనవమి ఉత్సవ అధ్యక్షుడు డాక్టర్ భగవంతరావు, ప్రధాన కార్యదర్శి గోవిందరాటి, ఉపాధ్యక్షుడు మెట్టు వైకుంఠం, కోశాధికారి శ్రీరామ్‌వ్యాస్ సహా విశ్వహిందూ పరిషత్ తెలంగాణ రాష్ట్ర ప్రచార ప్రముఖ్ పగుడాకుల బాలస్వామి బుధవారం గవర్నర్‌ను కలిసి ఆహ్వానించారు. 300 ఏళ్ల చరిత్ర కలిగిన ఆలయంలో కల్యాణాన్ని వైభవంగా నిర్వహించనున్నట్లు వారు తెలిపారు.

5న పంచాయతీ కార్మికుల రాష్ట్ర మహా సభ



ముషీరాబాద్: తెలంగాణ ప్రగతిశీల గ్రామ పంచాయతీ వర్కర్స్ యూనియన్ టీయూసీఐ అనుబంధ కార్మిక సంఘం రాష్ట్ర మహాసభలను విజయవంతం చేయాలని రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె.సూర్యం అన్నారు. ఈ నెల 5న నారాయణపేట జిల్లా కేంద్రంలో ఈ మహాసభలు నిర్వహించనున్నట్లు తెలిపారు. ఈ మేరకు బుధవారం మార్క్స్‌భవన్‌లో మహాసభల పోస్టర్‌ను విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పెరిగిపోతున్న ధరలు చాలీచాలని జీతభత్యాలతో పంచాయతీ కార్మికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు. జీపీ కార్మికులకు మున్సిపల్ కార్మికుల తరహాలోనే జీవో నెంబర్ 60 ప్రకారం వేతనాలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. పీఎఫ్, ఈఎస్ఐలను అమలు చేయాలన్నారు. కార్మికులు పెద్ద సంఖ్యలో హాజరై మహాసభలను విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో టీయుసీఐ రాష్ట్ర ఉపాధ్యక్షులు ఎస్.ఎల్.పద్మ, ఎం.హన్మేశ్, రాష్ట్ర సహాయ కార్యదర్శి సి.వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

పోలీసులపై దాడి చేసిన యువకుల అరెస్టు

రాజేంద్రనగర్: విధి నిర్వహణలో ఉన్న పోలీసు కానిస్టేబుళ్లపై దాడికి పాల్పడిన ఐదుగురు యువకులను రాజేంద్రనగర్ పోలీసులు అరెస్టు చేసి రిమాండుకు తరలించారు. ఇన్‌స్పెక్టర్ క్యాస్ట్రో సమాచారం... రాజేంద్రనగర్ పోలీస్‌స్టేషన్ పరిధిలోని అంబియన్స్ ఫోర్టు చౌరస్తా వద్ద కొందరు యువకులు రోడ్డుపై గొడవ పడుతున్నారని డయల్ 100కు సమాచారం అందింది. దీంతో రాజేంద్రనగర్ పోలీసులను అప్రమత్తం చేశారు. నైట్ డ్యూటీలో ఉన్న కానిస్టేబుల్ చంద్రశేఖర్‌తో పాటు మరో కానిస్టేబుల్‌లు సంఘటన స్థలానికి చేరుకున్నారు. గొడవ పడుతున్న వారిని సముదాయించేందుకు ప్రయత్నించగా వినిపించుకోకుండా పోలీసులపైనే దాడి చేశారు. ఈ విషయాన్ని పోలీసులు స్టేషన్‌కు సమాచారం అందించడంతో హుటాహుటిన చేరుకున్న పోలీసులు దాడికి పాల్పడిన రాజేంద్రనగర్, నౌ నంబర్, హ్యాపీ హోమ్స్ ప్రాంతాలకు చెందిన ఖాజా అద్నాన్(24), మహ్మద్ అర్బాజ్ ఖాన్(19), సయ్యద్ అబ్దుల్(21), ఖాజా ఫయాజుద్దీన్(22), షేక్ హిమాయత్ అలీ(22)లను అదుపులోకి తీసుకున్నారు. నిందితులపై కేసు నమోదు చేసి బుధవారం రిమాండ్‌కు తరలించారు.

సేవా కార్యక్రమాలను విస్తృతం చేయాలి


ఎమ్మెల్యే కౌసర్‌తో తెలంగాణ ఫ్యామిలీ కౌన్సెలింగ్ ఆర్గనైజేషన్ ప్రతినిధులు

గోల్కొండ: సేవా కార్యక్రమాలను మరింత విస్తృతం చేయాలని కార్వాన్ ఎమ్మెల్యే కౌసర్ మోహియుద్దీన్ అన్నారు. తెలంగాణ ఫ్యామిలీ కౌన్సెలింగ్ ఆర్గనైజేషన్ ప్రతినిధులు బుధవారం ఎమ్మెల్యేను ఆయన కార్యాలయంలో కలిశారు. ఈ సందర్భంగా వారు ఆయనకు ఈద్ ముబారక్ తెలిపి తమ ఆర్గనైజేషన్ నిర్వహిస్తున్న సేవా కార్యక్రమాలను వివరించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ టీఎఫ్‌సీవో నిర్వహిస్తున్న సేవా కార్యక్రమాలు ఆదర్శనీయమన్నారు. కోవిడ్ సమయంలో టీఎఫ్‌సీవో చైర్మన్ మహ్మద్ నజీబ్ బాధితులకు విశేషంగా సేవలు అందించారన్నారు. కోవిడ్ బాధితులకు ఆక్సిజన్ అందించి ఎందరో ప్రాణాలు రక్షించారని కొనియాడారు. ఇటువంటి సేవా కార్యక్రమాలను యువత స్ఫూర్తిగా తీసుకోవాలన్నారు. భవిష్యత్తులోనూ సేవా కార్యక్రమాలు నిర్వహిస్తూ నిరుపేదలకు అండగా ఉండాలని ఆయన టీఎఫ్‌సీవో ప్రతినిధులను కోరారు. కార్యక్రమంలో టీఎఫ్‌సీవో చైర్మన్ మహ్మద్ నజీబ్, కేంద్ర కార్యాలయ ఇన్‌చార్జి మహ్మద్ ఫహాద్, సమీర్, హబీబ్, అబ్దుల్ బారీ, తౌఫిక్, షహబాజ్ తదితరులు పాల్గొన్నారు.

హెచ్‌సీయూ భూముల వేలాన్ని అడ్డుకోవాలి


ప్లకార్డులు ప్రదర్శిస్తున్న విమలక్క తదితరులు

సుల్తాన్‌బజార్: కంచె గచ్చిబౌలిలోని హెచ్‌సీయూ భూములను యధాతథంగా కొనసాగించాలని అరుణోదయ సాంస్కృతిక సమాఖ్య అధ్యక్షురాలు విమలక్క డిమాండ్ చేశారు. ఈ మేరకు బుధవారం ఎస్ఎస్‌ఎస్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ప్రపంచ పర్యావరణ సంస్థ అధ్యక్షులు భద్ర, పీడీఎస్‌యూ నాయకులు విజయ్‌తో కలిసి ఆమె మాట్లాడుతూ....15 రోజులుగా హెచ్‌సీయూలో భూముల వేలంపై జరుగుతున్న పోరు విద్యా వాతావరణాన్ని దెబ్బతీస్తుందన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం విశ్వవిద్యాలయాల భూములపై కన్నేసిందని ఆరోపించారు. ప్రకృతి విధ్వంసం జరుగుతున్న నేపథ్యంలో ప్రజలు దీనిని వ్యతిరేకించాల్సిన అవసరం ఉందన్నారు. హెచ్‌సీయూ జీవ వైవిధ్యాన్ని రక్షించుకోవాల్సిన బాధ్యత అందరిపై ఉందన్నారు. విద్యార్థులపై అక్రమ కేసులను ఎత్తివేయాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వం మొండి వైఖరి పోకుండా తక్షణమే హెచ్‌సీయూలో ఉన్న పోలీసులను వెనక్కి రప్పించాలని కోరారు. కార్యక్రమంలో రమేష్, రాకేష్, ఉపేందర్, సురేష్ తదితరులు పాల్గొన్నారు.

కమనీయం..పరిణయోత్సవం


శ్రీదేవి భూదేవి సమేత శ్రీనివాసుని కల్యాణం


కల్యాణంలో పాల్గొన్న భక్తులు

లంగర్‌హౌస్: శ్రీనివాసుని పరిణయోత్సవం కనుల పండువగా జరిగింది.లంగర్‌హౌస్ త్రివేణి సంగంలోని జానకీ సమేత వీరవెంకట విజయరాఘవ స్వామి ఆలయంలో స్వామివారి వసంత నవరాత్రి బ్రహ్మోత్సవాలు వైభవంగా జరుగుతున్నాయి. ఉత్సవాల్లో భాగంగా బుధవారం వేదపండితులు రాజనర్సింహాచారి ఆధ్వర్యంలో పీఠాధిపతి 1008 రాహుల్‌దాస్ బాబా సమక్షంలో శ్రీదేవి భూదేవి సమేత శ్రీనివాసుని పరిణయోత్సవం నిర్వహించారు. విష్ణుసహస్రనామ పారాయణం, హోమం అనంతరం స్వామి వారి కల్యాణం చేశారు. గోవింద నామస్మరణతో ఆ ప్రాంతం మార్మోగింది.

యెగ్గే మల్లేషంపై దుష్ప్రచారాలు తగవు



మాట్లాడుతున్న శ్రీకాంత్

అఫ్జల్‌గంజ్: తెలంగాణ రాష్ట్ర కురుమ సంఘానికి ఒక్క రోజు కూడా సేవ చేయని కొందరు వ్యక్తులు పనిగట్టుకుని బురద చల్లేందుకు ప్రయత్నించడం బాధాకరమని, కులంపై దుష్ప్రచారాలు మానుకుని కులం అభివృద్ధికి కృషి చేయాలని రాష్ట్ర కురుమ సంగం మీడియా కమిటీ చైర్మన్ చీర శ్రీకాంత్ కురుమ అన్నారు. బుధవారం రాష్ట్ర కురుమ సంఘం కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ.... రాష్ట్ర కురుమ సంఘం అధ్యక్షుడు యెగ్గే మల్లేషం నాయకత్వంలో 12 ఏళ్లుగా రూ.వేల కోట్ల విలువ చేసే ఆస్తులను కూడబెట్టామని, ప్రతి నెల రూ. 30 లక్షలకు పైగా అద్దె రూపంలో సంఘానికి ఆదాయం చేకూర్చిన యెగ్గే మల్లేషంపై కొందరు ఉద్దేశపూర్వకంగా ఆరోపణలు చేస్తున్నారన్నారు. ప్రతి మండలంలో, జిల్లాల్లో, నియోజకవర్గాల్లో సభ్యత్వం నమోదు పూర్తయిన వెంటనే రాష్ట్ర సంఘం ఎన్నికలు పారదర్శంగా నిర్వహించనున్నట్లు తెలిపారు. సమావేశంలో సంఘం నాయకులు అరుణ్‌కుమార్, సత్యనారాయణ, కొలుపుల నర్సింహా, కొండల్‌రాజు, సి.రాఘవేందర్, మిరియాల విజయలత, కోటి అనిత, ఎం.విజయలక్ష్మీ, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బండారు నారాయణ, కట్ట మల్లేశం, చిట్టెం శైలేందర్, శ్యామ్‌రావు తదితరులు పాల్గొన్నారు.